క్లుప్తంగా

దరఖాస్తుల ఆహ్వానం

వాజేడు : మండల కేంద్రంలో ఐటీఐ కళాశాలలో 2025–26 విద్యాసంవత్సరానికి గాను ఐటీఐ, ఏటీసీ ట్రేడ్‌లలో చేరడానికి దరఖాస్తు చేసుకోవాలని కళాశాల ప్రిన్సిపాల్ పి.శేఖర్ ఒక ప్రకటనలో బుధవారం కోరారు. ఐటీఐ, ఏటీసీ ట్రేడ్‌లలో చేరేందుకు ఒకటే దరఖాస్తు చేసుకోవాలని మొదటి విడతలో సీటు రాని వారు వెబ్ ఆప్షన్ ఇస్తే సరిపోతుందని ఆయన తెలిపారు. పదో తరగతి పాసైన విద్యార్థులు ఈ నెల 31వరకు దరఖాస్తు చేసుకోవచ్చని ప్రిన్సిపాల్ తెలిపారు.

పిడుగుపడి విద్యుత్ సరఫరాకు అంతరాయం



వాజేడు : మండలంలో బుధవారం ఉరుములు, మెరుపులతో కూడిన పిడుగుల వర్షం కురిసింది. వెంకటాపురం(కె) నుంచి వాజేడు మధ్య 33/11 కేవీ విద్యుత్ లైన్‌కు చెందిన ఇన్సులెటర్లు పగిలిపోవడంతో వాజేడులో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. జోరువానలో సైతం ఏఈ అర్షద్ అహ్మద్ ఆధ్వర్యంలో సిబ్బంది లైన్ వెంట పరిశీలించి పగిలిపోయిన ఇన్సులెటర్ల స్థానంలో కొత్తవి అమర్చి సాయంత్రం విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు.

కేజ్‌వీల్స్‌తో రోడ్లపైకి రావొద్దు

గోవిందరావుపేట : వ్యవసాయ పనులు ప్రారంభం అయిన నేపథ్యంలో ట్రాక్టర్‌కు బిగించిన కేజ్‌వీల్స్‌తో యజమానులు రోడ్లు, సీసీ రోడ్లపై రావొద్దని, అతిక్రమిస్తే కేసులు నమోదు చేస్తామని పస్రా ఎస్సై అచ్చ కమలాకర్ అన్నారు. బుధవారం ఎస్సై మాట్లాడుతూ..దమ్ము చక్రాలతో ట్రాక్టర్లు రోడ్లపై వస్తే ప్రభుత్వ రోడ్లకు తీవ్ర నష్టం కలుగుతుందని అన్నారు.

అంగన్‌వాడీ టీచర్ ఆత్మహత్యాయత్నం

కన్నాయిగూడెం : మండలంలోని బుట్టాయిగూడెం పరిధి కొత్తూరు గ్రామానికి చెందిన అంగన్‌వాడీ టీచర్ కుమ్మరి శాంతి ఎలుకల మందు తాగి ఆత్మహత్యా యత్నానికి పాల్పడిన సంఘటన బుధవారం చోటుచేసుకుంది. గ్రామస్తుల కథనం ప్రకారం.. కొత్తూరులో అంగన్‌వాడీ టీచర్‌గా పని చేస్తున్న కుమ్మరి శాంతి భర్త నాగేశ్వర్‌రావు ప్రజా పాలన గ్రామసభలో తనకు ఇందిరమ్మ ఇళ్ల లిస్టులో పేరు రాలేదని మృతిచెందిన సంఘటన తెలిసిందే. కాగా బుధవారం ఇంటి వద్ద ఉన్న ఎలుకల మందును తాగి, అంగన్‌వాడీ సెంటర్‌కు వచ్చి అపస్మారక స్థితిలోకి వెళ్లింది. గమనించిన చుట్టుపక్కల వారు108లో ఏటూరునాగారం తరలించగా మెరుగైన వైద్యం కోసం వరంగల్‌కు తీసుకువెళ్లి వైద్యం చేయిస్తున్నట్లు తెలిసింది. కాగా శాంతి ఆత్మహత్యాయత్నానికి గల కారణాలు తెలియాల్సి ఉంది.

ముగ్గురిపై కేసు

ములుగు రూరల్ : పశువులను అక్రమంగా తరలిస్తున్న ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై వెంకటేశ్వర్‌రావు తెలిపారు. బుధవారం సాయంత్రం జిల్లా కేంద్రంలోని బస్టాండ్ సమీపంలో వాహనాల తనిఖీ చేపట్టగా అక్రమంగా డీసీఎం (టీఎస్ 12యూసీ 4656) వాహనంలో 11పశువులను తరలిస్తున్నారని చెప్పారు. డ్రైవర్, వాహన యజమాని, పశువులు తరలిస్తున్న ముగ్గురిపై కేసు నమోదు చేయడంతో పాటు పశువులను గోశాలకు తరలించినట్లు తెలిపారు.

సమస్యలు పరిష్కరించాలి

ఎస్‌ఎస్‌తాడ్వాయి : ప్రభుత్వ పాఠశాలల్లోని సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఎస్‌ఎఫ్‌ఐ మండల ఉపాధ్యక్షుడు వరుణ్ డిమాండ్ చేశారు. బుధవారం ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యంలో విద్యాసంస్థల బంద్ సందర్భంగా పాఠశాలలను బంద్ చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చదువుతున్న విద్యార్థుకు రవాణా సౌకర్యార్థం ప్రత్యేక బస్సు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. అనుమతి లేకుండా నిర్వహిస్తున్న ప్రైవేటు పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

సన్మానం

ములుగు రూరల్ : జిల్లా కేంద్రంలోని మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్‌గా విధులు నిర్వహించిన డాక్టర్ మోహన్‌లాల్, ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్ జగదీశ్వర్‌ను సన్మానించారు. ఈ మేరకు బుధవారం మెడికల్ కళాశాలలో వీడ్కోలు సమావేశం నిర్వహించారు. మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్‌గా బాధ్యతలు స్వీకరించిన స్వర్ణలత, ఆస్పత్రి సూపరింటెండెంట్ చంద్రశేఖర్ వారికి పూలబొకే అందించారు. కళాశాల ప్రొఫెసర్లు, విద్యార్థులు, వైద్యులు పాల్గొన్నారు.

వ్యవసాయంలో రసాయనాలు వాడొద్దు

ములుగు రూరల్ : రైతులు వ్యవసాయంలో రసాయన పదార్థాలు వాడకుండా ప్రకృతి వ్యవసాయంతో అధిక దిగుబడులు సాధించవచ్చని మాస్టర్ ట్రెయినర్ సాంబయ్య సూచించారు. బుధవారం కన్నాయిగూడెం, అంకన్నగూడెం గ్రామాల్లో వెలుగు రేఖ గ్రామీణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులకు అవగాహన కల్పించారు. క్రిమిసంహారక, రసాయన మందులను తగ్గించి ప్రకృతి వ్యవసాయం చేయాలని సూచించారు. తిరుపతి, ఏఈఓ రవికుమార్ ఉన్నారు.

అందని బిల్లులు.. వంటకు అవస్థలు

సమస్యల్లో మధ్యాహ్న భోజన పథకం నిర్వాహకులు

- బంగారం తాకట్టుపెట్టి వడ్డిస్తున్న కార్మికులు
- నెలల తరబడి పెండింగ్‌లోనే బిల్లులు



గోవిందరావుపేటలో విద్యార్థులకు భోజనం వడ్డిస్తున్న కార్మికులు

గోవిందరావుపేట : ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజన పథకం నిర్వహణ కార్మికులకు భారంగా మారుతోంది. అరకొర వసతులతో అష్టకష్టాలు పడుతూ విద్యార్థులకు వండి పెడుతున్నా తమకు కనీస వేతనం రావడం లేదని, బిల్లులు విడుదల చేయడంలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వంట చేసే నిర్వాహకులకు సీఎం బ్రేక్‌ఫాస్ట్, కోడిగుడ్ల బిల్లులు రాకపోవడంతో వారు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కూరగాయలు, నిత్యావసరాల ధరలు పెరగడం వల్ల ఆర్థిక భారంగా మారుతోంది. ప్రభుత్వం నుంచి రావాల్సిన బిల్లుల కోసం నెలల తరబడి వేచి చూడాల్సిన పరిస్థితి నెలకొంది. ప్రభుత్వం బకాయిలు విడుదల చేయకపోవడంతో కార్మికులు అప్పులపాలవుతున్నారు. కోడి గుడ్లు, వంట కార్మికుల వేతనాలు, సీఎం బ్రేక్ ఫాస్ట్ కి సంబంధించిన బిల్లులు ఆరు నెలలు, మరికొన్ని బిల్లులు నాలుగు నెలలుగా అందడం లేదు. ఇలాంటి పరిస్థితుల్లో పెట్టుబడి పెట్టి వండలేమని, ఒంటిపై ఉన్న బంగారాన్ని తాకట్టు పెట్టాల్సిన దుస్థితి నెలకొంటుందని వంట నిర్వాహకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

పెరుగుతున్న పని భారం

మండల వ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ పాఠశాలలో 2,607 మంది విద్యార్థులు చదువుతున్నారు. ఇందులో 30 పాఠశాలల్లో మధ్యాహ్న భోజన పథకంలో భాగంగా 53మంది కార్మికులు విద్యార్థులకు వంటలు చేసి వడ్డిస్తున్నారు. 1వ తరగతి నుంచి 5వ తరగతి వరకు ఒక్కో విద్యార్థికి రూ.6.78 పైసలు, 6వ తరగతి నుంచి 8వ తరగతి వారికి రూ.10.17 పైసలు, 9,10 తరగతుల విద్యార్థులకు రూ.10.67 పైసల చొప్పున, కోడిగుడ్డు ధర రూ.6ల చొప్పున ప్రభుత్వం చెల్లిస్తుంది. ఓ వైపు మార్కెట్‌లో ధరలు భగ్గుమంటుంటే ప్రభుత్వం పెరిగిన ధరలకు అనుగుణంగా బడ్జెట్ పెంచాల్సి ఉండగా వాటిని మాత్రం సవరించడం లేదు. మధ్యాహ్న భోజనం మెనూలో మార్పులు చేస్తూ వంట కార్మికులకు ఆర్థికభారంతో పాటు పని భారం పెంచుతుందనే విమర్శలు ఉన్నాయి.

నెలల తరబడి బిల్లులు పెండింగ్..

ప్రభుత్వమే విద్యార్థులకు అవసరమైన బియ్యం సరఫరా చేస్తున్నా హమాలీ చార్జీలు మధ్యాహ్న భోజన కార్మికులు భరిస్తున్నారు. మూడు, నాలుగు నెలలకు ఒకసారి బిల్లులు చెల్లిస్తున్నారు, ఒక్కోసారి రాని పరిస్థితుల్లో కార్మికులే ఇంటి నుంచి పెట్టుబడి పెట్టాల్సి వస్తోంది. కోడిగుడ్ల బిల్లులు, వేతనాలు రెండు, మూడు నెలలకి ఒకసారి ఇస్తున్నారు. భోజనం వండేందుకు ప్రభుత్వం గ్యాస్ సరఫరా చేయాలని, మెస్ చార్జీలు కాకుండా వంట సరుకులు సరఫరా చేయాలని కొన్నేళ్లుగా కోరుతున్నా ప్రభుత్వం స్పందించడం లేదు. కట్టెల పొయ్యిపైనే వంట చేయడం వల్ల కార్మికులు జబ్బుల బారిన పడాల్సి వస్తోందని వాపోతున్నారు.

అప్పుతోపాటు పని పెరుగుతోంది



సీఎం బ్రేక్‌ఫాస్ట్ బిల్లులు 11 నెలలు గడుస్తున్న ఇప్పటి వరకు రాలేదు. మధ్యాహ్న భోజనం బిల్లు నాలుగు నెలలవి, కోడిగుడ్ల బిల్లులు ఆరునెలలవి విడుదల కాలే. మూడు నెలల జీతాలు పెండింగ్‌లో ఉన్నాయి. అప్పు చేసి వంటనూనె ఇతర సామగ్రి కొనుగోలు చేసి పిల్లలకు వడ్డిస్తున్నాం. చేసిన అప్పులకు మిత్తిలు పెరిగి భారంగా మారుతుంది. అధికారులు చొరవ చూపితేనే మా కష్టాలు తీరుతాయి.

– సామ సమ్మక్క, వంట నిర్వాహకురాలు, పస్రా

బడ్జెట్ ప్రకారం బిల్లులు వస్తాయి

ప్రతి నెల మధ్యాహ్న భోజన బిల్లులు విడుదల కావు. ప్రభుత్వ పాలసీ ప్రకారం బడ్జెట్‌లో బిల్లులు ఇస్తున్నారు. కాగా మండల విద్యాధికారి గొంది దివాకర్ మీకు అనుకూలంగా ఉన్నట్లు రాసుకోండి అంటూ సాక్షితో ఫోన్‌లో నిర్లక్ష్యపు సమాధానం చెప్పడం గమనార్హం. కార్మికులకు నెలల తరబడి బిల్లులు చెల్లించకుండానే ఒక్క నెలవి మాత్రమే పెండింగ్ ఉన్నవి అంటూ దాటేసే ప్రయత్నం చేయడం కొసమెరుపు.

బాధిత కుటుంబాలకు మంత్రి పరామర్శ



బాధితులను పరామర్శిస్తున్న మంత్రి సీతక్క

ములుగు రూరల్ : మండలంలోని ఇంచర్ల గ్రామానికి చెందిన చింతల రవి ఇటీవల విద్యుదాఘాతంతో మృతి చెందగా బాధిత కుటుంబ సభ్యులను రాష్ట్ర మంత్రి ధనసరి సీతక్క పరామర్శించారు. బుధవారం రవి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించి, ఆర్థికసాయం అందజేశారు. అనంతరం అదే గ్రామానికి చెందిన మోరె రజినికాంత్ కుటుంబాన్ని పరామర్శించారు. కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు పైడాకుల అశోక్, గ్రంథాలయ సంస్థ చైర్మన్ బానోత్ రవిచందర్, మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ రేగ కల్యాణి, నాయకులు ఉన్నారు.

ఎస్‌ఎస్‌తాడ్వాయి : మండలంలోని కొంపర్తి గ్రామానికి చెందిన మేడారం జాతర కమిటీ చైర్మన్ అరెం లచ్చుపటేల్ తల్లి ఎల్లమ్మ అనారోగ్యంతో బుధవారం మృతి చెందింది. కాగా మంత్రి సీతక్క, కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు పైడాకుల అశోక్, మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ రేగ కల్యాణి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ బానోత్ రవీందర్‌లతో కలిసి బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. ఎల్లమ్మ మృతదేహంపై సీతక్క పూలమాల వేసి నివాళులర్పించారు. కిసాన్ సెల్ జిల్లా అధ్యక్షుడు గొళ్లపల్లి రాజేందర్, మండల అధ్యక్షుడు బొల్లు దేవేందర్, మాజీ సర్పంచ్ ఇర్ప సునీల్, నాయకులు గంట సాయిరెడ్డి, అలేటి జైపాల్‌రెడ్డి, నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

హామీలు నెరవేర్చకుండా కాలయాపన: మంద కృష్ణ



సమావేశంలో మాట్లాడుతున్న మంద కృష్ణమాదిగ

ములుగు రూరల్ : ఎన్నికల సమయంలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలు నెరవేర్చడంలో కాలయాపన చేస్తోందని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ ఆరోపించారు. బుధవారం జిల్లాకేంద్రంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన సన్నాహక సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల సమయంలో దివ్యాంగులకు, వితంతువులు, ఒంటరి మహిళలకు, చేయూత పింఛన్‌లు రెట్టింపు చేసి ఇస్తామని హామీ ఇచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేయడంలో విఫలమైందని అన్నారు. ఆగస్టు 13వ తేదీన హైదరాబాద్‌లో ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సభకు స్వచ్ఛందంగా తరలిరావాలని పిలుపునిచ్చారు. వీహెచ్‌పీఎస్ రాష్ట్ర నాయకుడు మంచోజు చంద్రమౌళి, జిల్లా అధ్యక్షుడు బానోత్ భద్రయ్య, జాతీయ నాయకుడు ఇరుగు పైడి, జిల్లా ఇన్‌చార్జి రమేష్, విజయ్, ఎంఎస్‌పీ జిల్లా అధ్యక్షుడు శ్యాంబాబు, ఉపాధ్యక్షుడు మారాతి రవిందర్, కడారి సాంబయ్య, స్వామి, ప్రసాద్, కార్తీక్ పాల్గొన్నారు.

లింగాలలో వైద్యశిబిరం

ఎస్‌ఎస్‌తాడ్వాయి : మండలంలోని కొడిశాల పీహెచ్‌సీ పరిధి లింగాలలో బుధవారం వైద్యశిబిరం నిర్వహించారు. హెల్త్ సూపర్‌వైజర్ బాలు, హెల్త్ అసిస్టెంట్ సీతారాంనాయక్ జ్వరపీడితుల నుంచి రక్త నమునాలు సేకరించారు. తొమ్మిది మందికి ఆర్‌డీటీ పరీక్షలు నిర్వహించగా పాయం హేమలతకు పాజిటివ్‌గా నిర్ధారణ అయింది. ఈగలు వృద్ధి చెంది వ్యాధులు ప్రబలుతాయని సూచించారు.

విద్యాసంస్థల బంద్ విజయవంతం

ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి రవి



పాఠశాలను బంద్ చేయిస్తున్న నాయకులు

ఏటూరునాగారం : విద్యారంగ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యంలో చేపట్టిన విద్యాసంస్థల బంద్ బుధవారం విజయవంతమైందని ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి రవి తెలిపారు. మండల కార్యదర్శి బట్ట స్వామి అధ్యక్షతన మండల వ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలలను బంద్ చేయించారు. రవి మాట్లాడుతూ వామపక్ష విద్యార్థి సంఘాల పిలుపులో భాగంగా డివిజన్ వ్యాప్తంగా బంద్ ప్రకటించడం జరిగిందన్నారు. పాఠశాలలు ప్రారంభమై 40 రోజులు కావొస్తున్న విద్యార్థులకు పూర్తిస్థాయిలో పాఠ్యపుస్తకాలు, యూనిఫామ్ కూడా ఇవ్వలేదని ఆరోపించారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చి 18 నెలలు గడుస్తున్నప్పటికీ విద్యాశాఖ మంత్రి లేకపోవడం సిగ్గుచేటని అన్నారు. ప్రైవేటు పాఠశాలలో ఫీజుల నియంత్రణ చట్టం తీసుకు రావాలని వారు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎస్‌ఎఫ్‌ఐ మండల అధ్యక్ష, కార్యదర్శులు ముక్కెర ధనుష్, స్వామి, జిల్లా కమిటీ సభ్యులు కుమ్మరి నర్సింగరావు, మండల నాయకులు రాకేష్, వెంకటేష్, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి



కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

ములుగు రూరల్ : రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరుతూ బీజేపీ కిసాన్ మోర్చా నాయకులు బుధవారం కలెక్టర్ దివాకరకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు సిరికొండ బలరాం మాట్లాడుతూ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను అమలు చేయాలని కోరారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు జిల్లాలో అమలు కావడంలేదని అన్నారు. రైతు భరోసా ఎకరాకు రూ.15 వేలు చెల్లించాలని డిమాండ్ చేశారు. ఎరువులు, విత్తనాల సరఫరాలో ఎటువంటి జాప్యం లేకుండా చూడాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు భాస్కర్ రెడ్డి, సురేందర్, స్వరూప, రాజు, వాసుదేవి రెడ్డి, కుమార్ తదితరులు ఉన్నారు.

విస్తృతంగా వాహనాల తనిఖీ చేపట్టాలి



రవీందర్,డీఎస్పీ



కారును తనిఖీ చేస్తున్న పోలీసులు

ములుగు రూరల్ : మావోయిస్టు వారోత్సవాల్లో భాగంగా సబ్ డివిజన్ పరిధిలో పోలీసులు విస్తృతంగా వాహనాల తనిఖీ చేపట్టాలని డీఎస్పీ రవీందర్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 28వ తేదీ నుంచి ఆగస్టు 3వ తేదీ వరకు మావోయిస్టు వారోత్సవాల నేపథ్యంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని కోరారు. మండలంలోని కాశిందేవిపేట, వెంకటాపూర్ పరిధిలోని నల్లగుంట, పస్రా పోలీస్‌స్టేషన్ పరిధి బుస్సాపూర్ క్రాస్, తాడ్వాయి స్టేషన్ పరిధి కాల్వపల్లి చెక్‌పోస్టుల వద్ద పోలీసులు వాహనాల తనిఖీలు చేపట్టి అనుమానితులను విచారించారని అన్నారు.మావోయిస్టులకు ఎవరూ సహకరించొద్దని సూచించారు. సహకరించిన వారిపై శాఖపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అనుమానిత వ్యక్తులు గ్రామాల్లోకి వస్తే పోలీసులకు సమాచారం అందించాలని అన్నారు.

వెంకటాపురం(కె) : మావోయిస్టు వారోత్సవాల సందర్భంగా మండలంలో స్థానిక ఎస్సై కొప్పుల తిరుపతి రావు ఆధ్వర్యంలో పోలీసులు వాహనాల తనిఖీలను బుధవారం ముమ్మరంగా చేపట్టారు. శివాలయం సెంటర్‌లో వచ్చిపోయే వాహనాలను నిలిపి క్షుణ్ణంగా పరిశీలించారు. అనుమానిత వ్యక్తులు ఎవరైన తారసపడితే వారి నుంచి పూర్తి సమాచారాన్ని సేకరించి పంపిస్తున్నారు. ఈ తనిఖీలో పీఎస్సై సాయికృష్ణ, సీఆర్‌పీఎఫ్ సిబ్బంది, సివిల్ పోలీసులు ఉన్నారు.

ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి



వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

గోవిందరావుపేట : ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాలని యూఎస్‌పీసీ జిల్లా నాయకుడు చాప బాబు దొర పేర్కొన్నారు. బుధవారం నాయబ్ తహసీల్దార్‌కు బాబుదొర, వాసుదేవ రెడ్డి, హట్కర్ సమ్మయ్య విద్యారంగ, ఉపాధ్యాయ సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా బాబుదొర మాట్లాడుతూ ఉద్యోగ, ఉపాధ్యాయులకు రావాల్సిన ప్రమోషన్లు వెంటనే చేపట్టాలని, పెండింగ్‌లో ఉన్న అన్ని రకాల బిల్లులను విడుదల చేయాలని, ప్రాథమిక పాఠశాలలో ఖాళీగా ఉన్న ప్రధానోపాధ్యాయుల పోస్టులను మంజూరు చేయాలని డిమాండ్ చేశారు.కె.రఘురాం, యాప కన్నయ్య, బి.శ్యాంసుందర్ రెడ్డి, ఎస్.చంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి



కట్టమైసమ్మ ఆలయం ప్రధాన రోడ్డుపై నుంచి ప్రవహిస్తున్న వరదనీరు



గిరిజన పెట్రోల్ బంక్ వద్ద కోతకు గురై కొట్టుకు పోయిన ప్రధాన రోడ్డు



గంపోనిగూడెం రైతువేదిక వద్ద రోడ్డుపై ప్రవహిస్తున్న వరదనీరు

జిల్లావ్యాప్తంగా మంగళవారం రాత్రి నుంచి బుధవారం ఉదయం వరకు కురిసిన వర్షాలకు ఏజెన్సీ గ్రామాలకు రాకపోకలు స్తంభించి పోయాయి. ఆయా గ్రామాల మధ్యలో గల వాగులు పొంగి ప్రవహిస్తుడడంతో రాకపోకలు నిలిచిపోయింది. కొత్రివాగు, సుద్దవాగులు, మల్కపల్లి వాగు ప్రవహిస్తున్నాయి. తుపాకులగూడెం, ఏటూరునాగారం ప్రధాన రహదారిపై కంతనపల్లి పరిధిలోని దొంగల గుట్ట వాగు ఉధృతంగా ప్రవహిస్తోంది. దీంతో అధికారులు హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, పునరావస కేంద్రాలకు వెళ్లాలనిఅధికారులు కోరుతున్నారు.

– సాక్షి నెట్‌వర్క్



ఏటూరునాగారం: కొండాయి వద్ద వరద ఉధృతిని పరిశీలిస్తున్న అధికారులు



వర్షపు నీటిని బయటకు పంపేందుకు గేట్లను ఎత్తుతున్న ఇరిగేషన్ సిబ్బంది



మంగపేట: వరద ఉధృతిని పరిశీలిస్తున్న అధికారులు



మంగపేట: కాజ్‌వే పై నుంచి ప్రవహిస్తున్న వరద



రాళ్లవాగు వద్ద కొట్టుకుపోయిన తాత్కాలిక రోడ్డు



తిమ్మంపేట పెద్ద కాల్వకు గండి పడంలో నీట మునిగిన పంట పొలాలు



వాజేడు: పునరావాస కేంద్రాలకు తరలివెళ్తున్న బాధితులు



గోవిందరావుపేట: చల్వాయిలో కృష్ణ ఇంట్లోకి చేరిన వర్షపు నీరు



కన్నాయిగూడెం: వాగువద్ద హెచ్చరిక ఫ్లెక్సీ ఏర్పాటు చేసిన అధికారులు



వెంకటాపురం(కె): రాళ్లవాగు వద్ద బారికేడ్లతో బందోబస్తు ఏర్పాటు చేసిన పోలీసులు



ఏటూరునాగారం: అడ్డుగా పడిన చెట్లను తొలగించిన ఎస్సై రాజ్‌కుమార్, పోలీసులు



ఏటూరునాగారం: కరకట్టను పరిశీలిస్తున్న మండల ప్రత్యేక అధికారి రాంపతి, ఎంపీడీఓ



ఏటూరునాగారం: 1వ వార్డులో ఫ్లెక్సీని ఏర్పాటు చేసిన సిబ్బంది

మనోధైర్యం తప్పనిసరి

- చైల్డ్ ప్రొటెక్షన్ అధికారి హరికృష్ణ

ములుగు రూరల్: విద్యార్థులు మనోధైర్యంతో ముందుకు సాగాలని చైల్డ్ ప్రొటెక్షన్ అధికారి హరికృష్ణ సూచించారు. ఈ మేరకు బుధవారం చైల్డ్‌లైన్ ఆధ్వర్యంలో కలెక్టర్ దివాకర, జిల్లా సంక్షేమ అధికారి తుల రవి ఆదేశాల మేరకు బాల్యంపై భరోసా అవగాహన సదస్సును పలు పాఠశాలల్లో బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు ఒత్తిడికి లోనుకాకుండా ప్రణాళికతో ఉన్నత స్థాయికి చేరుకునేలా కౌన్సిలర్లు అవగాహన కల్పించారని తెలిపారు. సీడీపీఓ శిరీష, సీహెచ్‌ఎల్ కౌన్సిలర్ రజిని, సైకో సోషల్ కౌన్సిలర్ కల్పన, ఎస్‌ఓ జీవన ప్రియ పాల్గొన్నారు.

రైతులకు పరిహారం చెల్లించాలి



సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

ములుగు రూరల్ : లక్నవరం, రామప్ప చెరువు కింద ముంపు బాధిత రైతులకు నష్ట పరిహారం చెల్లించాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు అంజాద్ పాషా కోరారు. బుధవారం జిల్లా కేంద్రంలో సీపీఐ మండల మహాసభను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా సమస్యలపై తిరుగులేని పోరాటం చేస్తున్న పార్టీ సీపీఐ అని అన్నారు. బొగ్గుల వాగుపై ఆనకట్ట నిర్మించి రైతులకు సాగునీరు అందించాలని డిమాండ్ చేశారు. జగ్గన్నగూడెం నుంచి కోటాయి, రాంపూర్ వరకు రోడ్లు నిర్మించాలని తెలిపారు. అనంతరం మండల కార్యదర్శిగా ముత్యాల రాజు, సహాయ కార్యదర్శిగా బోడ రమేష్‌తో పాటు 14 మందితో కూడిన మండల కమిటీని ఎన్నుకున్నారు. నాయకులు కృష్ణ, నటరాజ్, సదయ్య, రమేష్, శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.